క్లుప్తంగా

రూ.50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న సంజీవరావు

ఎల్.ఎన్.పేట: మండలంలోని శ్యామలాపురం వద్ద ఉన్న వంశధార పునరావాస కాలనీలో ఉమా మల్లేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి ఆదే కాలనీలో నివాసం ఉంటున్న పాడలి గ్రామానికి చెందిన నిర్వాసితుడు పెద్దకోట సంజీవరావు, వనజాక్షి దంపతులు రూ.50 వేల విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణానికి విరాళాలు కోరుతూ కమిటీ సభ్యులు మంగళవారం సంజీవరావు ఇంటికి వెళ్లారు. దీనిపై స్పందించిన సంజీవరావు దంపతులు తమ వంతుగా సాయం అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సంజీవరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

117 జీఓను రద్దు చేయాలి



రసీదులు అందజేస్తున్న ఏపీటీఎఫ్ సంఘం ప్రతినిధులు

నరసన్నపేట: విద్యా వ్యవస్థలో పెను మార్పులకు మూలమైన 117 జీఓను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ మండల శాఖ ప్రతినిధులు బి.కేశవరావు, లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5వ తరగతులు కొనసాగేలా చూడాలని టీడీపీ ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాడాం ఉన్నత పాఠశాలలో వీరు మాట్లాడుతూ ఎన్నికల ముందు టీడీపీ 117 జీఓ రద్దుపై స్పష్టమైన హామీ ఇచ్చిందన్నారు. మండలంలో ఏపీటీఎఫ్ సంఘానికి మంచి ఆదరణ లభిస్తుందని కేశవరావు అన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాంబాబు

సారవకోట: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ రాంబాబు సూచించారు. మండల సమావేశ మందిరంలో ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. వర్షాలు పడేటప్పుడు దోమలు, ఈగలు వృద్ధి చెందుతాయని, వాటి వల్ల రోగాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈఓపీఆర్డీ రేణుక, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కాపీరైట్ బుక్స్ పంపిణీ



పుస్తకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొత్తూరు: మండలంలోని కడుము జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ముదిల శంకరరావు తన సొంత నిధులతో కొనుగోలు చేసిన కాపీరైట్ బుక్స్‌ను కడుము పాఠశాలలో చదువుతున్న 200 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. మంగళవారం యునైటెడ్ నేషన్స్ పబ్లిక్ సర్వీస్ దినోత్సవం పురస్కరించుకుని మూడు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ కాపీరైట్ బుక్స్‌ను అందజేసినట్లు హెచ్ఎం గొర్లె తిరుమలరావు తెలిపారు. శంకరరావు ఉదారతకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సోషల్ ఆడిట్



జగన్నాథపురంలో ఫారం పాండ్‌ను తనిఖీ చేస్తున్న సోషల్ ఆడిట్ బృందం

హిరమండలం: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను సోషల్ ఆడిట్ బృందాలు క్షేత్రస్థాయిలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పనులతోపాటు, ఐటీడీఏ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ద్వారా చేపట్టిన పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. పనుల నాణ్యత, కొలతలు, బిల్లుల చెల్లింపులు వంటి అంశాలపై తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీ తిరుపతిరావు మాట్లాడుతూ ఏడుగురు డీఆర్పీలతో బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో తనిఖీలు నిర్వహించడం జరుగుతందన్నారు. ఈ తనిఖీలు జులై 8వ తేదీ వరకు ఉంటాయన్నారు. తనిఖీలు పూర్తయిన చోట్ల గ్రామ సభలు నిర్వహించడం జరుగుతందన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు పక్కన ఎమ్మెల్యే గోవిందరావు

- రైతులకు రాయితీపై విత్తనాలు, ఎరువులు అందించాలి
- ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



సమావేశానికి హాజరైన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

పాతపట్నం: మండలంలోని రైతులకు అధికారులు అందుబాటులో ఉండాలని, విత్తనాలు, ఎరువుల విషయంలో లోటు రాకుండా చూడాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఎంపీడీఓలో ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన సోమవారం మండల సమావేశం నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎమ్మెల్యే గోవిందరావు పాల్గొని మాట్లాడారు. బైదలాపురం పీహెచ్‌సీ వైద్యురాలు పి.సత్యవాణి విధులకు సక్రమంగా రావడంలేదని, గిరిజనులకు వైద్య సేవలు అందడం లేదని సభ దృష్టికి పలువురు ప్రజాప్రతినిధులు తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. పాతపట్నం సీహెచ్‌సీ సీహెచ్‌సీకి నెలకు 10 యూనిట్ల బ్లడ్ ఉచితంగా అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో ఎక్కువ మార్కులు సాధించినవారికి మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు ఆగస్టు 15వ తేదీన అందజేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అధికారులు ప్రోటో కాల్ పాటించాలన్నారు. ఎమ్మెల్యేకు వచ్చిన జీతాన్ని ట్రస్టు ద్వారా నియోజకవర్గంలోని ప్రజల అవసరాలు, సమస్యలు తీరుస్తానన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ప్రతి నేలా మొదటి, మూడో బుధవారాల్లో అధికారులతో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తానన్నారు. మండలంలోని రైతులందరికీ ఆర్‌బీకేల ద్వారా ఈ-క్రాఫ్ చేస్తామని ఏఓ రవికుమార్ తెలిపారు. పెద్దలక్ష్మీపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రైల్వే ట్రాక్ పక్కన ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, పాఠశాలను వేరోచోట నిర్మాణం చేపట్టాలని, ద్వారాకాపురంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలని అన్నెపు ఉమామహేశ్వరావు సభ దృష్టికి తీసుకువచ్చారు.

ప్రజలకు మంచి చేయాలి..

రాజకీయాలకు అతీతంగా నాయకులు ప్రజలకు మంచి చేయాలని, అప్పుడే మంచి పేరు వస్తుందన్నారు. రాజకీయాలు శాశ్వతం కాదని, చేసిన పని శాశ్వతంగా ఉంటుందన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన పార్టీ సూపర్ సిక్స్ పథకాలు అర్హులందరికీ అందజేయాలన్నారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకు జెడ్పీటీసీ సభ్యురాలు లింగాల ఉషారాణి, ఎంపీపీ దొర సావిత్రమ్మ, అధికారులు సత్కరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు సవిరిగాన ప్రదీప్, గంగు శోభారాణి, మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు, తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణరాజు, మండల సలహాదారుడు ఎం.గణపతిరావు, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ కృష్ణారావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కల్యాణ్, వైద్యుడు సదాశివ, జేఈ ప్రసాద్, ఎంఈఓ శ్రీధర్, ఈఓపీఆర్డీ కృష్ణారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



నరసన్నపేట: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఎల్.ఎన్.పేట: నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఎల్.ఎన్.పేట: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, లైన్స్‌క్లబ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.కె.మిశ్రో అన్నారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో మంగళవారం నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బడి వయసు గల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు టి.ఉపేంద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు నవభారతి, ఆరుద్ర, విజయలక్ష్మి, సంగీత తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కోవిలాం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్.నారాయణరావు కిట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరారు.

నర్సింగరాయుడుపేటలో..

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలని, విద్యార్థులను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించాలని ఉపాధ్యాయులు డి.మురళీధరరావు, డి.రమణయ్య కోరారు. బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా నర్సింగరాయుడుపేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లలో సదుపాయాలు గురించి వివరించారు. విద్యాప్రమాణాలు బాగున్నాయని, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత తమదని హామీ ఇచ్చారు.

సూపర్‌వైజర్ మృతికి సంతాపం

సారవకోట: పాతపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టులో విధులు నిర్వహించిన సూపర్‌వైజర్ ప్రియంవద ఇటీవల మృతి చెందారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయ ఆవరణలో మంగళవారం సంతాపం తెలియజేశారు. ఇదే ప్రాజెక్టులో ఆమె అంగన్‌వాడీ కార్యకర్తగా, సూపర్‌వైజర్‌గా పనిచేశారు. సంతాపం తెలియజేసిన వారిలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు ఉన్నారు.

తాగునీటి ట్యాంక్‌ల పరిశీలన



మెళియాపుట్టి: వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు



పొందూరు: వాటర్ ట్యాంక్‌ను క్లీన్ చేయిస్తున్న హెల్త్ సిబ్బంది

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని తాగునీటి ట్యాంకులను ఎంపీడీఓ భాస్కరరావు మంగళవారం పరిశీలించారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శి అప్పారావుకి సూచించారు. ట్యాంకులలో పూడిక తొలగించి క్లోరినేషన్ చేయించాలన్నారు. మహేంద్రతనయ నది ఒడ్డున ఉన్న మోటార్ పంప్ హౌస్‌ను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయితీలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యదర్శి అప్పారావు, ఉప సర్పంచ్ మాడుగుల భానోజీరావు, రేఖాన వాసు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పొందూరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా హెల్త్ సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా లోలుగు గ్రామంలోని కాలనీలో తాగునీటి ట్యాంకును క్లోరినేషన్ చేయించారు. బయట పేరుకుపోయిన నాచును తీయించారు. బ్లీచింగ్ పౌడర్‌ను ట్యాంకు చెట్టూ చల్లించారు. పంచాయతీ కార్యదర్శి ప్రసన్న కుమారి పర్యవేక్షించారు. ఎంఎల్‌హెచ్‌పీ కె.రవికుమార్, జీవీ అప్పారావు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

కొత్తూరు: నివాసం చుట్టూ పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ త్రివిక్రమరావు ప్రజలకు సూచించారు. మండలంలోని గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నందున పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. బోర్ల వద్ద నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల్లో పూడికలు లేకుండా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచ్ పెదకోట సాదుబాబు, అంగన్‌వాడీ కార్యకర్త, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

కొత్తూరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్య, అంగన్‌వాడీ, పంచాయతీరాజ్ సిబ్బందికి ఎంపీడీఓ త్రివిక్రమరావు, ఈఓపీఆర్డీ కృష్ణారావుతోపాటు పలువురు మండల స్థాయి అధికారులు సూచించారు. పలు శాఖలకు చెందిన ఉద్యోగులతో మండల పరిషత్ సమావేశం మందిరంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నందున పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి ముందు వాడుక నీరు నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధులపై అప్రమత్తత కార్యక్రమాలు ఈ నెల 29 తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమరావు తెలిపారు. వైస్ ఎంపీపీ తులసీవరప్రసాదరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



అమ్మవారిని దర్శించుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మి, శ్రీకాకుళం జేసీ నవీన్

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా అమ్మవారికి నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కలెక్టర్‌గా పనిచేసి బదిలీ అయిన నాగలక్ష్మి, శ్రీకాకుళం జేసీ నవీన్‌లు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికి వేదాశీస్సులు, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు పర్యవేక్షించారు.

శ్రీనివాస్ సేవలు అభినందనీయం



శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

సోంపేట: సోంపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా దుద్ది శ్రీనివాసరావు ఏడాది పాటు అందించిన సేవలు అభినందనీయమని రోటరీ పీజీడీ జి.విశ్వనాథం, శ్రీశయన చైతన్య వేదిక ప్రతినిధులు అన్నారు. శ్రీశయన చైతన్యదీపిక సంఘం ఆధ్వర్యంలో శ్రీనివాసరావు దంపతులకు మంగళవారం సత్కరించి అభినందించారు.

వక్తలు మాట్లాడుతూ.. ఏడాదిగా సోంపేట, కంచిలి మండలాల్లో రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు చేసిన సేవలను గుర్తు చేశారు. చైతన్యదీపిక సంస్థ భవన నిర్మాణానికి రూ. 18 లక్షల విలువైన స్థలాన్ని అందించారని చెప్పారు.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



నరసన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సెబ్ అధికారులు



ఆమదాలవలస: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

నరసన్నపేట: యువత మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని, దీని వల్ల వారి బంగారు భవిష్యత్తు అంధకారం అవుతుందని సెబ్ సీఐ సతీష్ కుమార్, నరసన్నపేట ఎస్ఐ అశోక్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెబ్ అధికారులు, జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో స్థానిక పోలీసులు విద్యార్థులకు మాదక ద్రవ్య వల్ల కలిగే దుష్ప్రభావాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే అనారోగ్యాలు వివరించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవికుమార్, సెబ్ ఎస్ఐ కావ్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎస్ఐ అశోక్‌బాబు మాట్లాడుతూ మంచి అలవాట్లతో జీవితానికి బంగారు బాటలు వేసుకోవాలన్నారు.

బూర్జ: విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని స్థానిక ఎస్సై జి.వి.ప్రసాద్ అన్నారు. మండలంలోని బూర్జ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎస్.తవిటినాయుడు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కళాశాలలో, ఇతరత్రా ప్రాంతాల్లో డ్రగ్స్ సేవిస్తున్నా, విక్రయిస్తున్నా.. ఆ సమాచారం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

హిరమండలం: యువత మత్తుకు బానిస కావద్దని స్థానిక పోలీస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బి.గోవిందరావు సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య అక్రమ సరఫరా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలు గంజాయి, కొకైన్ వంటివి తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. మత్తు పదార్థాలకు బానిసైతే ఆరోగ్యం పాడవ్వడంతోపాటు జీవితాలు నాశనమవుతాయన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.ఈ.ఎస్.పట్నాయక్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.దివాకర్, ఎస్ఈబీ ఇన్స్‌పెక్టర్ కె.రాజారావు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి జె.రవిబాబు ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. నేటి యువత మాదక ద్రవ్యాల బారినపడి విలువైన జీవితాలను కోల్పోతున్నారన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతి ధనుంజయరావు, ఎస్ఈబీ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నం: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ మహమ్మద్ యాసిన్ సూచించారు. స్థానిక కోర్టు కూడలిలో ఉన్న మహేంద్ర జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. నార్కోటిక్ డ్రగ్స్, సింథటిక్ డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల ప్రభావంతో యువత మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రిన్సిపాల్ ఎం.ఆంజనేయులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నరసన్నపేట: జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ఎస్ఐ అశోక్‌బాబు



హిరమండలం: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పి.ఈ.ఎస్.పట్నాయక్



బూర్జ: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ ప్రసాద్

తాగునీటి సమస్య పరిష్కరించండి



మంచినీటి కుళాయిల వద్ద పడిగాపులు కాస్తున్న మహిళలు

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలంలో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నకోరాడకు చెందిన పలువురు మహిళలు మాట్లాడుతూ మంచినీటి కుళాయిల ద్వారా తాగునీరు పూర్తి స్థాయిలో రావడం లేదన్నారు. రోజులో గంట సమయం మాత్రమే నీరు వస్తుందన్నారు. నాలుగైదు రోజులకు ఒకసారి పైపులైన్లు మరమత్తులకు గురవుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు కోరుతున్నారు.

చల్లబడిన వాతావరణం

కొత్తూరు: మండలంలో మంగళవారం సాయంత్రం కొద్దిపాటి వర్షం కురిసింది. నెల రోజుల నుంచి వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. వరి, పత్తి విత్తనాలతోపాటు వంగ, పలు రకాల కూరగయల మొక్కలు నాటేందుకు వర్షం కోసం రైతులు ఎదురు చూశారు. కురిసిన ఈ కొద్దిపాటి వర్షం రైతులకు కొంత మేర ఉపయోగపడనుంది. రోజంతా ఉక్కపోత ఉన్నప్పటికీ వర్షంతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలకు ఊరటనిచ్చింది.

ఘనంగా గ్రామదేవత చల్లదనోత్సవాలు



సోంపేట: పలాసపురంలో గ్రామ దేవతను ఊరేగిస్తున్న దృశ్యం

సోంపేట: మండలంలోని పలాసపురం, బెంకిలి గ్రామపంచాయతీల్లో ఆయాగ్రామ దేవతల చల్లధన ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. పలాసపురంలో గ్రామస్తులు, ఉపాధి వేతనదారులు, రైతుల ఆధ్వర్యంలో సింధుపట్టపురాణి చల్లధన మహోత్సవం జరగ్గా.. కోలాటం, కాళీకా వేషాధారణలతో తిరువీధులు నిర్వహించారు. సర్పంచ్ తడక జోగారావు, జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద పాల్గొన్నారు. అలాగే బెంకిలిలో కూడా గ్రామదేవత భైరోడమ్మ చల్లదన ఉత్సవం నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు.

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బూర్జపాడు, వేదపురం, కొఠారి, మండపల్లి తదితర గ్రామాల్లో గ్రామదేవతలకు చల్లదనం ఉత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేకతాళాలు, మంగళవాయిద్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామదేవతను ఊరేగించారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



కల్యాణం చేస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో ఉన్న భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అర్చకులు చామర్తి గోపాలాచార్యులు, చామర్తి జగన్నాథాచార్యుల నేతృత్వంలో భూదేవి, శ్రీదేవి సమేతంగా వేంకటేశ్వరుని ఉత్సవ మూర్తులను వేదికపై ఉంచి కన్యాదానం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల సంప్రదాయంగా కల్యాణ వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో దంపతులు కల్యాణ వేడుకలలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త సన్యాసిరావు, బిర్లంగి రామ్మోహన్‌రావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



హాజరైన దంపతులు